మూడవ సారి మోదీని గెలిపించుకుందాం!



మాట్లాడుతున్న బీజేపీ ఎంపి అభ్యర్థి ఈటెల రాజేందర్..

కుత్బుల్లాపూర్: ప్రచారంలో భాగంగా శనివారం కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని గంగాస్థాన్, జయదర్శిని, శ్రీసాయి కృప అపార్ట్‌మెంట్స్‌లో మల్కాజిగిరి బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ నరేంద్ర మోదీని మూడవ సారి ప్రధానిని చేయడంతో పాటు మల్కాజిగిరిలో తనను గెలిపించాలని కోరారు. ఓబీసీ మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దబుద్దుల సతీశ్‌సాగర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు ఎస్.మల్లారెడ్డి, రాజిరెడ్డి, బీజేపీ నేతలు పాల్గొన్నారు.

ఉచిత భగవద్గీత తరగతులు

చింతల్: శ్రీ ధర్మశాస్త్ర సేవా సమితి భాగ్యనగర్ ఆధ్వర్యంలో ఉచిత భగవద్గీత తరగతులను నిర్వహించనున్నట్లు శ్రీధర్మశాస్త్ర సేవా సమితి భగత్ సింగ్‌నగర్ కమిటీ ఓ ప్రకటనలో తెలిపింది. శనివారం సాయంత్రం 6:30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు, ఆదివారం ఉదయం 8:30 గంటల నుంచి 10 గంటల వరకు భగత్‌సింగ్‌నగర్‌లోని శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయం హరిహర క్షేత్రంలో ఈ తరగతులను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. వివరాలకు 9059663440, 9949236133 నెంబర్లలో సంప్రదించవచ్చని తెలిపారు.

ఇష్టంలేని పెళ్లి చేశారని యువకుడు ఆత్మహత్య

సుభాష్‌నగర్: ఇష్టం లేని వివాహం చేశారని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.. పోలీసులు తెలిపిన మేరకు.. బీహార్ రాష్ట్రానికి చెందిన తన్వీర్‌ఖాన్ (27) సూరారంలోని తన బంధువు షానవాజ్‌ఖాన్ ఇంట్లో ఉంటూ పెయింట్ పనులు చేస్తున్నాడు. ఇతనికి భార్య నూరాని బేగం, మూడు నెలల పాప ఉంది. మూడు నెలల క్రితం కుటుంబాన్ని సొంత ఊర్లో ఉంచి తన్వీర్‌ఖాన్ ఒక్కడే సూరారంలోని బంధువు వద్దకు వచ్చాడు. ఈ నెల 12న సాయంత్రం 4 గంటల ప్రాంతంలో గది లోపలికి వెళ్లి తలుపులు పెట్టుకున్నాడు. కుటుంబ సభ్యులు ఎంత పిలిచినా బయటకు రాకపోవడంతో కిటికీలోంచి చూడగా గది పైకప్పు రాడ్‌కు ఉరివేసుకుని వేలాడుతూ కనిపించారు. దీంతో తలుపులు తెరిచి అతన్ని కిందకు దింపి చూడగా అప్పటికే మృతి చెందాడు. ప్రేమించిన అమ్మాయిని కాదని మరో యువతితో వివాహం చేయడంతోనే మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడినట్లు మృతుని కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.


ఎమ్మెల్యేలకు.. ఈ ఎన్నికలు

సవాలే..

అసెంబ్లీ ఎన్నికల నుంచి పార్లమెంట్ ఎన్నికల వరకు రాష్ట్ర రాజకీయాల్లో మారిన పరిస్థితులతో కాంగ్రెస్ బలం పుంజుకోగా, దేశమంతా తమకు అనుకూలంగా ఉందని బీజేపీ సాగుతుండగా బీఆర్‌ఎస్ బలహీన పడిందో.. మౌనంగా ఉంటుందో అర్థం కాని పరిస్థితి మల్కాజ్‌గిరి పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్‌లలో కనిపిస్తోంది. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు చెందిన ఎమ్మెల్యేలలో ఎంత మంది తమ నియోజకవర్గాల్లో పట్టు నిలుపుకుంటారో పట్టు కోల్పోతారో అనే చర్చలు జోరుగా సాగుతున్నాయి. -మేడ్చల్

మల్కాజ్‌గిరి పార్లమెంట్ పరిధిలో 7 నియోజకవర్గాల్లో ఆరుగురు ఎమ్మెల్యేలు బీఆర్‌ఎస్ వారే..

ఈ ఎన్నికల్లో సత్తాచాటకుంటే వారి ప్రాబల్యం తగ్గినట్లే.. | ఆరుగురు ఎమ్మెల్యేలు మెజార్టీతో గెలిచిన వారే.. | పార్లమెంట్ ఎన్నికలలో తమ బలం చూపుతారా..?




కంటోన్మెంట్ ఎమ్మెల్యే కన్నుమూతతో ఉప ఎన్నికలు

అందరూ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలే..

మల్కాజ్‌గిరి నియోజకవర్గంలో మేడ్చల్, కంటోన్మెంట్, కూకట్‌పల్లి, ఉప్పల్, కుత్బుల్లాపూర్, మల్కాజ్‌గిరి, ఎల్‌బీనగర్ నియోజకవర్గాలు ఉన్నాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఈ ఏడు నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులు ఎమ్మెల్యేలుగా గెలిచారు. కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత రోడ్డు ప్రమాదంలో మరణించగా అక్కడ ఉప ఎన్నికలు పార్లమెంట్ ఎన్నికలతో కలిసి జరుగుతున్నాయి. మేడ్చల్ నుంచి మాజీ మంత్రి మల్లారెడ్డి 33,419 ఓట్ల మెజార్టీతో కాంగ్రెస్ అభ్యర్థిపై, కుత్బుల్లాపూర్ నుంచి వివేకానంద 85,576 ఓట్ల మెజార్టీతో బీజేపీ అభ్యర్థిపై, ఉప్పల్‌లో లక్ష్మారెడ్డి కాంగ్రెస్ అభ్యర్థిపై 49,030 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. మల్కాజ్‌గిరిలో మర్రి రాజశేఖర్‌రెడ్డి కాంగ్రెస్ అభ్యర్థిపై 49,530 ఓట్ల మెజార్టీతో, కూకట్‌పల్లిలో మాధవరం కృష్ణారావు కాంగ్రెస్ అభ్యర్థిపై 70,387 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. కంటోన్మెంట్‌లో దివగంత ఎమ్మెల్యే లాస్య నందిత బీజేపీ అభ్యర్థిపై 17,169 ఓట్ల మెజార్టీతో, ఎల్బీనగర్‌లో సుధీర్‌రెడ్డి బీజేపీ అభ్యర్థిపై 22,305 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. గెలిచిన ఏడుగురు బీఆర్‌ఎస్ నుంచి గెలిచిన వారే. ఏడు నియోజకవర్గాల్లో మూడు నియోజకవర్గాల్లో బీజేపీ రెండోస్థానంలో నిలవగా కాంగ్రెస్ నాలుగింటిలో రెండవ స్థానంలో నిలిచింది.

బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలకు పార్లమెంట్ ఎన్నికలు సవాలే..

ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ ఎన్నికలు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలకు సవాల్‌గా మారాయి. మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి, కంటోన్మెంట్ ఎమ్మెల్యే నందిత మొదటిసారి ఎమ్మెల్యే కాగా ఆమె మరణించడంతో రాజశేఖర్‌రెడ్డికి బీఆర్‌ఎస్ అధిష్టానం మల్కాజ్‌గిరితో పాటు కంటోన్మెంట్‌ను అప్పగించింది. దీంతో రాజశేఖర్‌రెడ్డికి డబుల్ భారం కాగా, మిగతా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు సీనియర్లు కావడంతో వారికి బాధ్యతలు ఎక్కువగా ఉన్నాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో 30 నుంచి 40 వేల మెజార్టీ సాధించిన బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు ఈ ఎన్నికల్లో ఆ పార్టీకి తమ నియోజకవర్గాల నుంచి అంత మెజార్టీ తేవడం పెద్ద టాస్క్‌గా మారింది. బీఆర్‌ఎస్ అధికారంలో లేకపోవడం, రాష్ట్రంలో ఆ పార్టీకి ప్రతికూల పరిస్థితులు ఉండటం, మరోవైపు కాంగ్రెస్ ప్రభుత్వం ఎమ్మెల్యేలపై డేగకన్ను పెట్టి ఎక్కడ దొరుకుతారా.. వారిపై దాడులు చేయిద్దామా అన్నట్లుగా ఉండటం, ఇప్పటికే మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి, మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డిల ఆస్తులను అక్రమాలు అంటూ కూల్చివేయడంతో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల్లో అధికార పార్టీ అంటే గుబులు పుట్టింది.



బీజేపీ నుంచి మాజీ మంత్రి ఈటల రాజేందర్‌ను పోటీలో నిలపగా కాంగ్రెస్ రాష్ట్రస్థాయి నాయకుడు బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన మాజీ మంత్రి మహేందర్‌రెడ్డి భార్య ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా పనిచేసిన సునీతారెడ్డిని రంగంలోకి దింపింది. రాజకీయంగా, ఆర్థికంగా చూస్తే బీఆర్‌ఎస్ అభ్యర్థి లక్ష్మారెడ్డి వీరికి ఎందులోనూ సరితూగే నాయకుడు కాదు. ఆయన ఇంతవరకు ఎలాంటి చట్టసభలకు ఎన్నిక కాలేదు. ఓ వైపు పార్టీకి ప్రతికూల వాతావరణం, మరోవైపు ప్రత్యర్థి పార్టీల నుంచి అగ్రనాయకులు పోటీలో ఉండటం బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలకు తమ పార్టీ అభ్యర్థిని గెలిపించడం పెద్ద సవాల్‌గానే మారింది.



బలపడుతున్న కాంగ్రెస్, బీజేపీలు

ఎన్నికలు దగ్గర పడుతుండటంతో అసెంబ్లీ ఎన్నికల వరకు మల్కాజ్‌గిరి పార్లమెంట్ పరిధిలో తిరుగులేని శక్తిగా ఉన్న బీఆర్‌ఎస్ బలహీనపడుతోంది. ఆ పార్టీలో పనిచేసిన కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, మేయర్లు, చైర్మన్లు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ద్వితీయ శ్రేణి నాయకులు, కొన్నిచోట్ల ప్రథమ శ్రేణి నాయకులు పార్టీని వీడి కాంగ్రెస్‌లో, బీజేపీలో చేరుతుండటంతో చేరికలను ఎమ్మెల్యేలు ఆపకపోవడంతో ఆ పార్టీ ఎన్నికల నాటికి బలహీనంగా మారింది. కాంగ్రెస్ కార్పొరేటర్లను, కౌన్సిలర్‌లను, ప్రధాన నాయకులను పార్టీలో చేర్చుకుని బలం పెంచుకుంటోంది. బీజేపీ అదే తరహాలో చేరికలను ప్రోత్సహిస్తూ బలం పెంచుకునే దిశగా అడుగులు వేస్తుంది. మొత్తం మీద పార్లమెంట్ ఎన్నికలు మల్కాజ్‌గిరి నియోజకవర్గం పరిధిలోని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలకు ప్రతిష్టాత్మకంగా మారాయి.

రెండుసార్లు కాంగ్రెస్.. ఒకసారి ఎన్డీయే మిత్రపక్షం..

మల్కాజ్‌గిరి పార్లమెంట్‌కు మూడుసార్లు ఎన్నికలు జరగ్గా రెండు సార్లు కాంగ్రెస్ ఒకసారి ఎన్డీయే మిత్రపక్షం అభ్యర్థులు విజయం సాధించారు. 2019 ఎన్నికల్లో మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి బీఆర్‌ఎస్ నుంచి పోటీలో ఉండగా కాంగ్రెస్ నుంచి రేవంత్‌రెడ్డి బరిలోకి దిగి ఎంపీగా విజయం సాధించారు.

రాగిడి లక్ష్మారెడ్డికి బీఆర్‌ఎస్ టికెట్

మల్కాజ్‌గిరి బీఆర్‌ఎస్ టికెట్ మాజీ మంత్రి మల్లారెడ్డి తన కుమారుడు భద్రారెడ్డికి ఇవ్వాలని పట్టుబట్టి చివరి క్షణంలో తమ కుటుంబం ఎన్నికల్లో పోటీ చేయదని ప్రకటించి విరమించుకున్నారు. నగర మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ టికెట్ ఆశించి వచ్చే పరిస్థితి లేదని కాంగ్రెస్‌లో చేరిపోయారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు శంభీపూర్ రాజు పోటీకి ఆసక్తి చూపలేదు. దీంతో గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నుంచి బీఆర్‌ఎస్‌లో చేరిన ఉప్పల్‌కు చెందిన నాయకుడు రాగిడి లక్ష్మారెడ్డికి బీఆర్‌ఎస్ టికెట్ కేటాయించింది.

ప్రైవేట్ బస్సుల అక్రమ పార్కింగ్‌కు చెక్

రంగారెడ్డినగర్: ఎట్టకేలకు ప్రైవేట్ బస్సుల అక్రమ పార్కింగ్‌కు అడ్డుకట్ట పడింది. రంగారెడ్డి నగర్ డివిజన్ ఏపీహెచ్‌బీ కాలనీలోని జలమండలి కార్యాలయానికి ఆనుకునే టీఎస్‌హెచ్‌బీకి చెందిన సుమారు 2.5 ఎకరాల స్థలం ఉంది. ఈ స్థలంలో స్థానిక కాలనీకి చెందిన ఓ వ్యక్తి అన్నీ తానై అక్రమ పార్కింగ్ నిర్వహిస్తూ ప్రైవేట్ బస్సులకు అడ్డాగా మార్చాడు. ప్రతి నెలా లక్షల్లో వసూళ్లకు పాల్పడుతూ రాత్రి వేళల్లో సెక్యూరిటీగా ఓ వ్యక్తికి సైతం నియమించారు. ఈ విషయమై పలుమార్లు సాక్షిలో వార్తా కథనాలు ప్రచురితమైంది. ఈ విషయం టీఎస్‌హెచ్‌బీ ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడంతో కొద్ది రోజులుగా ప్రైవేట్ బస్సుల పార్కింగ్‌లను కట్టడి చేస్తూ వస్తున్నారు. ఇందులో భాగంగా ఇటీవల బస్సులు టీఎస్‌హెచ్‌బీ స్థలంలోని రాకుండా అటు, ఇటుగా గొయ్యిని తవ్వించారు. దీంతో ప్రైవేట్ బస్సులు పార్కింగ్‌కు తాత్కాలికంగా తెర పడినట్లైంది.



టీఎస్‌హెచ్‌బీ స్థలంలోకి ప్రైవేట్ బస్సులు వెళ్లకుండా గుంతను తీసిన దృశ్యం

అమ్మవారికి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

కుత్బుల్లాపూర్: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల్లో అమ్మవార్ల ఆరాధన ప్రత్యేకమని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. జీడిమెట్ల డివిజన్ జయరాంనగర్‌లోని మైసమ్మ, పోచమ్మ దేవాలయ శంకుస్థాపన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వివేకానంద్ మాట్లాడుతూ నిత్యం అమ్మవారిని ఆరాధిస్తే అన్ని శుభాలే కలుగుతాయన్నారు. అనంతరం చండి హోమంలో పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో జయరాం నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కుంటి మల్లేష్, ప్రధాన కార్యదర్శి మన్య హరి, వైస్ ప్రెసిడెంట్ భిక్షపతి, దేవాలయ కమిటీ చైర్మన్ నర్సింహులు, సభ్యులు మన్నె నరేష్, ఉపేందర్, రమేష్, రాములు, నాయకులు ముద్దాపురం ప్రభాకర్ గౌడ్, సుధాకర్, కృష్ణ గౌడ్, జ్ఞానేశ్వర్, అరుణా రెడ్డి, సమ్మయ్య నేత, రాజు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఏఐసీసీ మైనారిటీ కుత్బుల్లాపూర్ చైర్మన్‌గా జలీల్

జగద్గిరిగుట్ట: ఏఐసీసీ మైనారిటీ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ చైర్మన్‌గా సయ్యద్ జలీల్ ఖాన్‌ను నియమించారు. ఈ మేరకు ఏఐసీసీ మైనారిటీ వైస్ చైర్మన్, తెలంగాణ ఇంచార్జ్, ఫర్హాన్ అజ్మి చేతుల మీదుగా శనివారం నియామక పత్రం అందుకున్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికలలో పార్టీ గెలుపు కోసం శాయశక్తులా కృషి చేస్తానని సయ్యద్ జలీల్ ఖాన్ పేర్కొన్నారు.

'అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకుందాం'



పార్టీలో చేరిన వారితో కూన శ్రీశైలంగౌడ్,భూపతి రెడ్డి,మేయర్,కార్పొరేటర్లు.

మైనంపల్లి హన్మంతరావు

నిజాంపేట్: సునీత మహేందర్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించుకుని మల్కాజిగిరి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకునేందుకు కలిసి కట్టుగా పని చేయాలని పార్లమెంట్ ఇంచార్జి మైనంపల్లి హన్మంత్‌రావు అన్నారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని ప్రగతి నగర్ కెజీఆర్ కన్వెన్షన్‌లో శనివారం మేయర్ కొలను నీలా గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కాంగ్రెస్ పార్టీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రమ శిక్షణతో పని చేసి ఎన్నికల్లో విజయం సాధించాలని సూచించారు. కష్టపడ్డ నాయకులకు ఎన్నికల్లో తప్పకుండా టిక్కెట్లు ఇస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారన్నారు. ఈ సందర్భంగా వివిధ డివిజన్ల నుంచి సుమారు వెయ్యి మంది కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్,కో-ఆర్డీనేటర్ శోభారాణి, పీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగద్గిరిగుట్టలో....

జగద్గిరిగుట్ట డివిజన్ నుంచి నియోజకవర్గ ఇంచార్జి కొలను హన్మంత్‌రెడ్డి ఆధ్వర్యంలో కావలి చెన్నయ్య, సురేందర్‌రెడ్డిల ఆధ్వర్యంలో సుమారు ఐదు వందల మంది కార్యకర్తలు వివిధ పార్టీల నుంచి కాంగ్రెస్‌లో చేరారు. ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్,పీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతి రెడ్డిలు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

నిజాంపేట్ మాజీ సర్పంచ్ కాంగ్రెస్‌లో చేరిక....

నిజాంపేట్ మాజీ సర్పంచ్ వడ్ల నాగేశ్‌చారి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ కొలను హన్మంత్‌రెడ్డి సమక్షంతో సీనియర్ నాయకుడు కొలను శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ఎంసీ అధ్యక్షుడు కొలను రాజశేఖర్‌రెడ్డిల ఆధ్వర్యంలో పార్టీలో చేరారు.

కమిటీలు చెల్లవు....


ప్రస్తుతం ఎన్నికల సమయంలో వేసే ఎలాంటి కమిటీలు చెల్లవని, ఎన్నికల అనంతరం కార్యకర్తల,నాయకుల పనితీరును బట్టి మాత్రమే పదవులు ఇవ్వడం జరుగుతుందని మైనంపల్లి, హన్మంత్‌రావు, కూన శ్రీశైలంగౌడ్‌లు అన్నారు. ప్రస్తుతం బూత్ స్థాయిలో సమన్వయ కమిటీలు ఏర్పాటు చేస్తామని తెలిపారు.

ఆలయంలో ఎమ్మెల్సీ ప్రత్యేక పూజలు

కుత్బుల్లాపూర్: ఎమ్మెల్సీ, మేడ్చల్ జిల్లా బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు శంభీపూర్ రాజు శనివారం నర్సాపూర్‌లోని చాకరిమెట్ల ఆంజనేయ స్వామిని దర్శించుకున్నారు. అనంతరం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బిఆర్‌ఎస్ పార్టీ ఘన విజయం సాధించాలని ప్రార్థించారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, పార్టీ నేతలు ఉన్నారు.



కుమార్తెతో సహా గృహిణి అదృశ్యం



ప్రియాంక (ఫైల్) సాక్షి (ఫైల్)

సుభాష్‌నగర్: కుమార్తెను తీసుకుని ఓ గృహిణి ఇంటి నుండి వెళ్లిపోయిన ఘటన సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.. పోలీసులు తెలిపిన మేరకు.. సూరారం రాజీవ్‌గాంధీ నగర్‌కు చెందిన సాయిరామ్, ప్రియాంక(27) దంపతులు. వీరికి సాక్షి(2) కుమార్తె ఉంది. ఈ నెల 12న డ్యూటీ ముగించుకుని ఇంటికి వచ్చిన సాయిరామ్ అతని భార్య మధ్య చిన్నపాటి వివాదం చోటు చేసుకుంది. రాత్రి భోజనానంతరం నిద్రకు ఉపక్రమించగా శనివారం ఉదయం 5.30 గంటలకు నిద్ర లేచి చూడగా భార్యా, కుమార్తె కనిపించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

సమస్యలు లేని కార్పొరేషన్‌గా తీర్చిదిద్దుతాం

నిజాంపేట్: సమస్యలు లేని కార్పొరేషన్‌గా నిజాంపేట్‌ను తీర్చిదిద్దుతున్నామని మేయర్ కొలన్ నీలారెడ్డి అన్నారు. నిజాంపేట్ 14వ డివిజన్ పరిధి సిరి ఎన్‌క్లేవ్ వెల్ఫేర్ సొసైటీ కమిటీ సభ్యులు శనివారం మేయర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానికంగా నెలకొన్న సమస్యలపై వినతి పత్రం అందజేసిన కమిటీ సభ్యులు పరిష్కరించాలని కోరారు. దీనిపై స్పందించిన మేయర్ మాట్లాడుతూ అన్ని ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలను మెరుగు పరిచేందుకు కృషి చేస్తున్నామని, త్వరలోనే అధికారులతో పర్యటిస్తామని పేర్కొన్నారు. కార్పొరేటర్ ఏనుగుల శ్రీనివాస్ రెడ్డి, మహిళా నాయకురాలు సబితరెడ్డి, కాలనీ ప్రెసిడెంట్ ఆనంద్, జనరల్ సెక్రెటరీ మదన్ తదితరులు ఉన్నారు.

సహజయోగాతో ఒత్తిడి మాయం

దుండిగల్: దుండిగల్‌లోని ప్రగతి మోడల్ హైస్కూల్‌లో శనివారం సహజయోగ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సహజయోగ కో ఆర్డినేటర్ కృష్ణ మాట్లాడుతూ శారీరక, మానసిక రుగ్మతలను సహజ యోగ సాధన చేయడం ద్వారా దూరం చేసుకోవచ్చన్నారు. విద్యార్థులు మంచి ర్యాంక్‌లు సాధించాలని, నిరుద్యోగులు మంచి ఉద్యోగం రావాలని, గృహిణిలు పని సంబంధిత ఒత్తిడితో లోనవుతూ ఉంటారని, వారందరికి సహజ యోగ చక్కటి పరిష్కారమన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సంగీత, సంస్కృతిక నృత్య కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ వినయ్‌కుమార్, కౌన్సిలర్ రాముగౌడ్, పాఠశాల డైరెక్టర్ సురేష్ పాల్గొన్నారు.